పత్రికాప్రకటన                                                                 కాకినాడ, డిశంబర్ 14, 2018.

**తుఫాను ఎదుర్కొనేందుకు పక్కా ప్రణాళికతో ముందస్తు చర్యలు.**

**అధికార్లను అప్రమత్తం చేసి దిశా నిర్దేశం చేసిన కలక్టరు కార్తికేయ మిశ్రా.**

**ఆస్తి నష్టం, పంట నష్టాలు జరుగకుండా అవసరమైన చర్యలు.**

**కలక్టరేట్‌తో పాటు అమలాపురం, పెద్దాపురం, కాకినాడ డివిజన్లలో కంట్రోల్ రూములు ఏర్పాటు.**

బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన తుఫాను మూలంగా జిల్లాలో ఆస్తి నష్టం, పంట నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టడానికి పక్కా ప్రణాళికను జిల్లా యంత్రాంగం సిద్ధం చేసింది. ఈ మేరకు శుక్రవారం నాడు కాకినాడ కలక్టరేట్ నుండి కోస్తా ప్రాంతాల అధికార్లతో కలక్టరు కార్తికేయ మిశ్రా అత్యవసర వీడియా కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. జిల్లాలోని కోస్తా ప్రాంతాలలో వివిధ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కాకినాడ కలక్టరేట్‌తో పాటు అమలాపురం, కాకినాడ, పెద్దాపురం ఆర్‌డిఓల కార్యాలయాల్లో కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేసి కంట్రోల్ రూం నెంబర్లు ప్రజలకు తెలియజేయాలన్నారు . కోస్తా ప్రాంతంలోని మండలాల్లో తుఫాను సహాయ శిబిరాలు ఏర్పాటు చేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కలక్టరు ఆదేశించారు. ఈ సహాయ శిబిరాల వద్ద ఆహార పంపిణీ కోసం కిచెన్లు ఏర్పాటు చేయాలని కలక్టరు సూచించారు. జిల్లాలోని విద్యాశాఖ , సాంఘిక సంక్షేమ శాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖల ఆధ్వర్యంలోని కిచెన్లను, కిచెన్ సిబ్బంది సహాయ శిబిరాలకు తరలించాలని కలక్టరు ఆదేశించారు. తుఫాను మూలంగా మంచినీటికి అంతరాయం లేకుండా కోస్తా ప్రాంతంలోని 114 మంచినీటి సరఫరా పథకాలకు జనరేటర్లు ఏర్పాటు చేయడంతో పాటు, వాటికి అవసరమైన డీజిల్ కూడా సిద్ధం చేసుకోవాలన్నారు. అదే విధంగా కోస్తా ప్రాంతంలోని అన్ని గ్రామ పంచాయతీలకు మూడు ట్యాంకర్లు చొప్పున మంచినీటితో ట్యాంకర్లు సిద్ధం చేయాలన్నారు. అదే విధంగా మండల కేంద్రాల్లో కూడా మంచినీటి ట్యాంకర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ ట్యాంకర్లను అద్దెకు తీసుకోవాలని కూడా కలక్టరు సూచించారు. తుఫాను సహాయ శిబిరాల వద్ద ఆహార పంపిణీ కోసం నిత్యావసర వస్తువులు, కూరగాయలు ఐదు రోజులకు సరిపడ్డా సిద్ధం చేయాలని కలక్టరు ఆదేశించారు. తుఫాను సహాయ శిబిరాల వద్ద మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. తుఫాను సహాయ చర్యలు కోసం ప్రతీ మండలానికి 10 మినీగూడ్స్ వాహనాలను ఏర్పాటు చేయాలని డిటిసిని ఆదేశించారు. అదే విధంగా సహాయ కేంద్రాల వద్ద ఎల్.పి.జి. గ్యాస్ సిలిండరులు ఏర్పాటు చేయాలని డిఎస్ఓను ఆదేశించారు. ఎంఎల్ఎస్ పాయింట్‌లు 24 గంటలు పని చేయాలని వస్తువులు రావాణాకు వాహనాలు సిద్ధంగా ఉంచాలని అత్యవసర పరిస్థితిలో వినియోగించడానికి హొటల్స్ సహకారం తీసుకోవాలన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సహాయ శిబిరాల వద్ద ఐదుగురు పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని, విహెచ్ఎఫ్ సెట్స్‌ను కూడా సిద్ధం చేసి ఉంచాలని కలక్టరు ఆదేశించారు. తుఫాను మూలంగా రవాణాకు ఎటువంటి ఆటంకం లేకుండా ఉంచాలన్నారు. ఈ మేరకు ప్రతీ 10 కి.మీ.లకు మండల స్థాయి అధికార్లను ఏర్పాటు చేసి రవాణా సజావుగా జరిగేలా చూడాలన్నారు. తుఫాను సహాయ శిబిరాల్లో 500 టార్పాలిన్లు, 500 దుప్పట్లు సిద్ధం చేయాలని కలక్టరు ఆదేశించారు. విద్యుత్‌శక్తి సరఫరాకు అంతరాయం లేకుండా జిల్లాలో ఉన్న 80 జనరేటర్లకు మరో 100 జనరేటర్లు సిద్ధం చేయాలని, ఎలక్ట్రికల్ పోల్స్‌ను సిద్ధం చేయాలని కలక్టరు ఆదేశించారు. జిల్లాలో తుఫాను మూలంగా పంట నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికార్లను కలక్టరు ఆదేశించారు. కోతలు జరిగి కళ్ళాల్లో ఉన్న వరిని సురక్షిత ప్రాంతాలకు తక్షణం తరలించే చర్యలు చేపట్టాలన్నారు. పండ్ల తోటల వివరాలను గ్రామ పంచాయతీ వారీగా అందించాలని ఉద్యావనశాఖ అధికారులను కలక్టరు ఆదేశించారు. పశువులకు నష్టం జరుగకుండా వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వాటికి అవసరమైన గడ్డి, మందులు ఏర్పాటు చేయాలని పశుసంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు.

**కమ్యూనికేషన్ వ్యవస్థను మెరుగుపర్చాలిః-**

తుఫాను సమయంలో కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినకుండా వివిధ ఏజెన్సీలు సెల్

టవర్లలోజనరేటర్ బ్యాకప్‌ను పరిశీలించాలని వచ్చే ఆరు, ఏడు రోజుల పాటు అవి పని చేసే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని , దీని కోసం ట్రైయిల్ రన్ నిర్వహించాలని కలక్టరు ఆదేశించారు.

**అధికార్లకు శెలవులు రద్దుః**

తుఫాను హెచ్చరిక మూలంగా అధికార్లకు శలవులు రద్దు చేయడం జరిగిందని , ఇప్పటికే శలవులో వెళ్లిన వారు తిరిగి రావాలని కలక్టరు ఆదేశించారు. వివిధ శాఖల అధికార్లు, సిబ్బంది తుఫాను సహాయ చర్యలు కోసం అందుబాటులో ఉండాలని కలక్టరు సూచించారు.

**తక్షణ సహాయక చర్యలకు తహసిల్దార్లకు 3 లక్షలు నిధులు ః**

తుఫాను సహాయ చర్యలు చేపట్టడం కోసం కోస్తా ప్రాంతంలోని అన్ని మండల తహసిల్దార్లను 3 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు కలక్టరు తెలిపారు. అదే విధంగా గ్రామ పంచాయతీ సెక్రటరీ 20 వేల రూపాయలు నిధులు వారి ఖాతాలో జమ చేయనున్నట్లు కలక్టరు తెలిపారు.

**సినీయర్ అధికార్ల పర్యవేక్షణ ః-**

జిల్లాలో తుఫాను ముందు జాగ్రత్త చర్యలను శనివారంనాడు స్వయంగా పరిశీలించడం జరుగుతుందని కలక్టరు కార్తికేయ మిశ్రా తెలిపారు. తుఫాను తీవ్రతను బట్టి అమలాపురంలో గానీ, రాజోలులోగానీ మకాం వేసి సహాయక చర్యలను పర్యవేక్షిస్తామన్నారు. తనతో పాటు జాయింట్ కలక్టరు రాజమహేంద్రవరం, రంపచోడవరం, ఎటపాక సబ్ కలక్టర్ల సేవలను వినియోగిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలక్టర్ ఎ.మల్లిఖార్జున, డిఆర్ఓ ఎస్‌విఎస్ సుబ్బలక్ష్మి, అడిషనల్ ఎస్‌పి ఎస్‌వి శ్రీధరరావు, ఆర్‌డిఓలు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.